# భయం లేకుండా పరీక్షలు రాయాలె: కిషన్ రెడ్డి

స్టూడెంట్లు భయం లేకుండా పరీక్షలు రాసి సక్సెస్ అవ్వాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. ప్రధాని సూచనలను పాటిస్తే స్టూడెంట్లు విజయం సాధిస్తారని అన్నారు. హైదరాబాద్‌లోని మెరీడియన్ స్కూల్ లో జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచంలోని ఏ ప్రధాని కూడా మోడీలాగా స్టూడెంట్లతో మనస్ఫూర్తిగా మాట్లాడలేదన్నారు. స్నేహితుడిగా, దేశాధినేతగా ప్రధాని మోడీ.. స్టూడెంట్లకు అమూల్యమైన సలహాలిచ్చారన్నారు. 2047 నాటికి దేశం స్వాతంత్ర్య వందేండ్ల వేడుక జరుపుకుంటుందని, ఈ 25 ఏండ్లు అందరం కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సాఫ్ట్‌వేర్‌తో పాటు అనేక రంగాల్లో ఇండియన్లు సత్తా చాటుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సమాజాన్ని చూపించాలని, ఎగ్జామ్స్ అయిపోయిన వెంటనే టూర్లకు పంపాలని చెప్పారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. దేశాన్ని విశ్వగురువు స్థానంలో నిలబెట్టేందుకు స్టూడెంట్లు కృషి చేయాలన్నారు. ఉద్యోగం, పెండ్లి, పిల్లలు వంటి వ్యక్తిగత జీవితంలో పాటు దేశం, సమాజం గురించి కూడా ఆలోచించాలని సూచించారు.



మెరీడియన్ స్కూల్‌లో జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి

ఈనాడు

# 'అక్షర'సిరికి ప్రధాని భాషోపదేశం

**ఇతర భాషలు ఎలా నేర్చుకోవాలో తొమ్మిదో తరగతి విద్యార్థినికి వివరించిన మోదీ**

ఈనాడు, దిల్లీ, హైదరాబాద్‌-న్యూస్‌టుడే, గచ్చిబౌలి: మాతృభాషతోపాటు ఇతర భాషలను ఎలా నేర్చుకోవాలి, వాటిపై పట్టు సాధించడం ఎలా? అని హైదరాబాద్‌ గచ్చిబౌలిలోని జవహర్‌ నవోదయలో 9వ తరగతి చదువుతున్న అక్షరసిరి ప్రధాని మోదీని ప్రశ్నించింది. పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మోదీ శుక్రవారం నిర్వహించిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో అక్షరసిరి ఈ ప్రశ్న అడగ్గా.. ప్రధాని సమాధానమిచ్చారు. 'భారత్‌ వైవిధ్యంతో నిండిన దేశం. మన దగ్గర వందల భాషలు, వేల యాసలు ఉన్నాయి. ఎప్పుడైనా విదేశీయులు నమస్తే అని చెబితే మన చెవులు రిక్కించుకుంటాయి. ఇంత పెద్దదేశంలో ఉన్న మనం ఆసక్తితో సంగీత వాయిద్యాలను నేర్చుకోవాలని అనుకుంటాం. అదే సమయంలో ఇతర రాష్ట్రాల భాషలు నేర్చుకుంటే నష్టమేంటి? అందుకోసం ప్రయత్నించాలి. తమిళం ప్రపంచంలోనే అత్యంత పురాతన భాష అని గర్వంగా చెప్పాలి. అందుకే నేను గతంలో ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించినప్పుడు తమిళంలో కొన్ని విషయాలు చెప్పాను. ప్రతి ఒక్కరూ మాతృభాషతో పాటు ఏదో ఒక ఇతర భారతీయభాష నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. కనీసం రెండు వాక్యాలనైనా ఎదుటివారి మాతృభాషలో మాట్లాడితే వారి సొంత మనిషైపోతారు. అహ్మదాబాద్‌లో ఒక కార్మిక కుటుంబం ఉండేది. అక్కడ ఓ పాప ఎన్నో భాషల్లో మాట్లాడేది. ఆమె తల్లిది కేరళ, తండ్రి బెంగాల్‌. చుట్టుపక్కల వారికోసం హిందీ మాట్లాడేవారు. ఇంటిపక్కన మరాఠీవారు ఉండేవారు. స్కూల్లో గుజరాతీ నడిచేది. 8-10 ఏళ్ల బాలిక ఇన్ని భాషలు మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యమేసేది. అందువల్ల మనం భాషా వారసత్వాన్ని చూసి గర్వించాలి. సాధ్యమైనన్ని నేర్చుకోవాలి" అని ప్రధాని పేర్కొన్నారు.




ప్రధానిని భాష గురించి ప్రశ్నించిన అక్షరసిరి.. సమాధానమిస్తున్న మోదీ..

## మోదీ విద్యార్థుల పక్షపాతి: జి.కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్‌, సనత్‌నగర్‌-న్యూస్‌టుడే: పరీక్షా పే చర్చా కార్యక్రమం సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, భాజపా ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక హైదరాబాద్‌లోని మెరీడియన్‌ స్కూల్‌కు, సనత్‌నగర్‌లోని హిందూ పబ్లిక్‌ స్కూల్‌కు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌, భాజపా ఇన్‌ఛార్జి తరుణ్‌ఛుగ్‌లు హిందూ పబ్లిక్‌ స్కూల్‌కు హాజరయ్యారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రధాని మోదీ విద్యార్థుల పక్షపాతి. పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నేరుగా మాట్లాడుతున్నారు. మేం 6 కిలోమీటర్లు పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. నేలమీదే కూర్చుని పాఠాలు విన్నాం. మరో పాతికేళ్లకు 100 సంవత్సరాల స్వతంత్ర భారత్‌ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నది ప్రధాని మోదీ ఆకాంక్ష' అని అన్నారు.

## ర్యాంకుల కోసం పోటీ వద్దు: సంజయ్‌

"ర్యాంకులు సాధించడానికి కొన్ని కార్పొరేట్‌ పాఠశాలలు విద్యార్థులను రాచి రంపాన పెడుతున్నాయి. మరికొన్ని పాఠశాలలైతే ర్యాంకులను కొంటున్నాయి. సామాజిక స్పృహ, విజ్ఞానం లేని విద్యలో మొదటి ర్యాంకు వచ్చినా అవసరం లేదు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడానికే 'పరీక్షా పే చర్చ' మోదీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 600 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం' అని సంజయ్‌ అన్నారు. "విద్యార్థుల ఆలోచన, ఆసక్తిని గుర్తించి.. వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి" అని భాజపా తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి తరుణ్‌ ఛుగ్‌ అన్నారు.

## లక్ష్మీప్రియకు ప్రధాని ప్రశంసలు

వరంగల్‌ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఓరుగల్లుకు చెందిన నృత్యకారిణి లక్ష్మీప్రియ ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థులతో ఏటా నిర్వహించే పరీక్ష పే చర్చా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దిల్లీలోని తాల్కతోర స్టేడియంలో మోదీ ఎదుట లక్ష్మీప్రియ నృత్య ప్రదర్శన చేసింది. మండల స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు నిర్వహించిన కళోత్సవ్‌ పోటీల్లో ప్రతిభ చూపిన ఆమెకు అవకాశం దక్కింది. ఈమె నృత్య ప్రదర్శనకు మంత్రముగ్ధులై మోదీ ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని అభినందించారు.





ప్రధాని మోదీ ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చ కార్యక్రమం శుక్రవారం జరిగింది. బంజారాహిల్స్ మెరిడియన్ స్కూల్‌లో చర్చకు హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు



సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బండి సంజయ్. చిత్రంలో తరుణ్‌చుగ్, ఉపాధ్యాయులు